నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 24 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

మద్దతు ధర, బోనస్ చెల్లించాలి

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మద్దతు ధర తోపాటు బోనస్ ఒకేసారి చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. అలాగే సన్నాలతోపాటు దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. సన్నాలను అమ్మిన నెలరోజుల్లోగా బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు. కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించిందని, చాలామంది రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించారన్నారు. సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు కొక్కిన రాష్ట్ర ప్రభుత్వం బోనస్ కూడా ధాన్యం విక్రయించిన నెల రోజుల్లోగా ఇస్తామని ప్రకటించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. రుణమాఫీ పూర్తి చేయకుండా చేతులెత్తేసిన ప్రభుత్వం రైతుభరోసా మాటే మర్చిపోయిందని, రైతులు పెట్టుబడులకు డబ్బులులేక ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. 10నెలల కాలంలోనే రేవంత్ సర్కార్ అట్టర్ ఫ్లాప్ అయిందని, ప్రజలు పదేపదే కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. మాది రైతుల ప్రభుత్వమని గప్పాలు కొట్టుకుంటున్న రేవంత్ సర్కార్ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో రైతుల ఉసురు తగులుతుందన్నారు.

కొనుగోలు కేంద్రం విషయంలో రాజకీయాలు తగదు

కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ ఆధారంగా ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. రైతులు ధాన్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. అంతా సజావుగా సాగుతున్న నేపథ్యంలో.. మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని తొలగించాలని స్థానిక కాంగ్రెస్ నేతలు రాజకీయాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలను మానుకోవాలని హితవుపలికారు. పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని తొలగిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని, రైతులకు ఇబ్బందులు కలిగించే పనులు చేపట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మధు, సూర్యప్రకాశ్‌రావు, మనోహర్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాసులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజల చెంతనే ఉంటా..

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 23: నిరంతరం ప్రజల చెంతనే ఉండి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం అలంపూర్ చౌరస్తాలో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కరించేలా చూస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం ప్రజలకు చేరేలా చూస్తానన్నారు. రాజోలి చెందిన సత్యనారాయణకు రూ.60వేలు, రామాపురం గ్రామానికి చెందిన తిరుమలకు రూ.26,500, రాజోలికి చెందిన దయాసాగర్ రూ.21వేలు ఇలా వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన 10మంది లబ్ధిదారులకు రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



గద్వాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ధర్నా
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

గద్వాల, నవంబర్ 23 : ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీల మేరకు దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచాలంటూ కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు రాజేశ్, పరశురాముడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు హనుమంతునాయుడు, నాగర్ దొడ్డి వెంకట్రాములు, కుర్వ పల్లయ్య మాట్లాడారు. రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలు, 3వేలకు పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌లను పెంచుతామని హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. పింఛన్ పెంపు లేకపోగా.. ఉన్న పింఛన్‌లు ఎప్పుడు వస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పింఛన్ పెంపు చేయకుండా దివ్యాంగుల తోపాటు ఇతర పింఛన్ దారులను సీఎం మోసం చేశాడని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు తక్షణమే రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పింఛన్ డబ్బులను పక్కదారి పట్టిస్తుందని ఆరోపించారు. దివ్యాంగులకు లోన్లు, వాహన పరికరాలు అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దివ్యాంగులకు సంబంధించి రూ. 9వేల కోట్ల బడ్జెట్‌ను వారికి కాకుండా చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దివ్యాంగుల తోపాటు పింఛన్‌దారులను గాలికి వదిలేశారన్నారు. రేవంత్ సర్కార్ వికలాంగ సమాజంపై చిన్నచూపు చూస్తుందన్నారు. వారి సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో పింఛన్ పెంపుపై ఇచ్చిన హామీ వెంటనే నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో వీర భద్రప్పకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు రంజిత్, అశోక్, ఆంజనేయులు, హనుమంతు, మైనార్టీ నాయకులు అతికూర్‌రెహమాన్, మక్బూల్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో పహారా కాస్తున్న పోలీసులు, నిర్మానుష్యంగా మారిన గ్రామ ప్రధాన రహదారి

- కొండారెడ్డిపల్లిలో నిశ్శబ్ద వాతావరణం
- ఎవరేం మాట్లాడుతున్నారని నిఘా
- మూగబోయిన వాట్సాప్ గ్రూపులు
- కల్వకుర్తికి భారీ సంఖ్యలో పోలీసులు

నీడలో..

సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో మౌనం రాజ్యమేలుతోంది.

ఎవరేం మాట్లాడినా..? ఎవరిపైకి ఏం వస్తుందో..? అది ఏ కుటుంబాన్ని బలితీసుకుంటుందోనన్న భయం గ్రామస్తులను వెంటాడుతున్నది. అధికారం అర్రులుచాచి పడగ విప్పుకొని బుసలు కొడుతుంటే.. విషాగ్ని ఎందరి ప్రాణాలను ఆహుతి చేస్తుందోనన్న భయంతో గ్రామస్తుల గొంతులు మూగబోయాయి. 13 ఏండ్లపాటు గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించి అధికార బలాన్ని ఎదురించడానికి తన బలం సరిపోక, అవమానాలను, అరాచాకాలను తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడిన పాంకుంట్ల సాయిరెడ్డి కుటుంబాన్ని ఓదార్చేందుకు వెళ్లాలనుకున్న గ్రామస్తులను అధికార బలం భయపెడుతున్నది. సాయిరెడ్డిని కడసారి చూపుచూసుకొని నాలుగు కన్నీటి చుక్కలు రాల్చేందుకు కూడా అడుగు ముందుకు పడని దుస్థితి గ్రామస్తులది.

– మహబూబ్‌నగర్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- రాత్రైనా తెలియని సాయిరెడ్డి మరణవార్త
- దవాఖానలోనే మాజీ సర్పంచ్ పార్థివదేహం
- అమెరికా పర్యటనలో సాయిరెడ్డి పెద్ద కొడుకు
- కడచూపునకు నోచుకోని స్థానికులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుల అగడాలు భరించలేకపోతున్నానని మరణవాంగ్మూలం రాసుకొని ప్రాణాలు తీసుకున్న సాయిరెడ్డి పార్థివదేహం కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలోని మార్చురీలో ఉంది. పెద్ద కొడుకు వెంకట్‌రెడ్డి బిడ్డల వద్దకు అమెరికా వెళ్లిన నేపథ్యంలో ఆయన కోసం మిగతా కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. ఆదివారం రాత్రి వెంకట్‌రెడ్డి హైదరాబాద్ వచ్చే అవకాశాలు ఉండడంతో ఆయన వచ్చే వరకు భౌతికకాయం మార్చురీలోనే ఉండనున్నది. సాయిరెడ్డి సంతానం, బంధువుల తప్పా.. అయ్యో అని సానుభూతివ్యక్తం చేసే గ్రామస్తులే కరువయ్యారు. సాయిరెడ్డి మృతి గురించి ఎవరు.. ఎక్కడ మాట్లాడొద్దనే రీతిలో అధికారం బెదిరింపులు జారీ చేయడంతో.. ఎవరిని మందలిస్తే ఏం చేటు వస్తుందనే భయంతో కళ్లతోనే మాట్లాడుకునే నిర్బంధాన్ని సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లి గ్రామస్తులు చవి చూస్తున్నారు.

రాత్రి 10 గంటలైనా తెలియని మరణవార్త

అత్యంత దురదృష్టం ఏమిటంటే.. మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడనే వార్త కొండారెడ్డిపల్లి గ్రామస్తులు చాలామందికి రాత్రి 10 గంటల వరకు తెలియని పరిస్థితి. సాయంత్రం 6 గంటల వరకే ప్రపంచానికి తెలిసిన మరణ వార్త స్థానికులకు తెలియకుండా పోయింది. గ్రామానికి చెందిన ఒకరు రాత్రి 8 గంటలకు తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వచ్చాడు. ఉద్యోగ నిమిత్తం వేరే ప్రాంతంలో ఉన్న అతని కొడుకు సాయిరెడ్డి ఆత్మహత్య గురించి చెప్పేవరకు తెలియకుండా పోయింది. అంటే.. సాయిరెడ్డి గురించి మాట్లాడానికి గ్రామంలో అధికారం నిర్బంధం విధించింది. గ్రామంలోని వాట్సాప్ గ్రూపుల్లో సాయిరెడ్డి ఎలాంటి మాటముచ్చట కూడా రావొద్దని అధికారం హెచ్చరించడంలో వాట్సాప్ గ్రూపులు మూగబోయాయి. చివరకు కుటుంబ సభ్యులు కూడా జరిగిన దారుణాన్ని చెప్పుకుని తనివితీరా ఏడవడానికి కూడా అధికారం భయపెడుతుంది.

కల్వకుర్తిలో భారీ సంఖ్యలో పోలీసులు

అయ్యో దారుణం జరిగింది. నియంతృత్వం, రాక్షసపాలనను ఎవరన్న ప్రశ్నిస్తారన్న అనుమానంతో వారి గొంతులను పురిట్లోనే పిసికిపారేయాలని అధికారం ఇచ్చిన ఆదేశాలతో కల్వకుర్తికి పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. పోలీసులు దవాఖానలో ఎవరేం మాట్లాడుకుంటున్నారని నిఘా ఉంచారు. దవాఖానలో ఏం జరుగుతుంది.. గ్రామస్తులు ఏం మాట్లాడుకుంటున్నారు..? అధికారం అనుచరుల చేత గమనిస్తుంది. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే అధికారం చెప్పుచేతల్లోనే దవాఖానలో వ్యవహారం అంతా సాగుతుంది.

కొండారెడ్డిపల్లిలో భయం

కొండారెడ్డిపల్లికి భయం ఈ మధ్యన వచ్చింది కాదు. అధికారం గద్దెనెక్కిన నాటి నుంచి అధికార వాసనత్వం గ్రామస్తులకు భయాన్ని కొంచెం, కొంచెం పరిచయం చేస్తూ వచ్చింది. భూ వ్యవహారాల్లో తల దూర్చి అధికార బెదిరింపులు, దాడులకు గురైన గురువారెడ్డి ఆత్మహత్య నాటికి గ్రామస్తులకు భయం పూర్తిస్థాయిలో పరిచయమైంది. కొండారెడ్డిపల్లికి నాలుగులేన్ల రోడ్డు విస్తరణలో చాలామంది రైతుల భూములు, భూమిలోపల ఉన్న పైప్‌లైన్లు, బోరు బావులు నలిగిపోయినా రైతులను భయంతో కిర్రుమనలేదు. గ్రామం మధ్యలో భూములపై కన్నేసిన కిక్కురుమనలేదు. అధికారం చెప్పిందే వేదం అంటూ జీ హుజూర్ అనే దుస్థితి. కాదంటే పోలీసు కేసులు పరిచయమవుతాయి. జైళ్లో ఊచలు లెక్కించాల్సి వస్తుంది. అధికారానికి చెందిన పోరంబోకోళ్లే చేతుల్లో చావు దెబ్బలు తినాల్సి వస్తుంది. ఇంత భయంలో బతుకుతున్న గ్రామస్తుల్లో సాయిరెడ్డి ఆత్మహత్య మరింత భయాన్ని పెంచింది. ఈ నేపథ్యంలో కొండారెడ్డిపల్లికి అచ్చంపేటకు చెందిన పెద్ద పోలీస్ సారు నేతృత్వంలో భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఒకవైపు అధికారం, మరోవైపు పోలీసులు పహారా కాస్తుంటే ఈ రాత్రి గడిస్తే చాలురా దేవుడా..? అని స్థానికులు గడియలను లెక్కబెడుతున్నారు.

సాయిరెడ్డి ఎలా చనిపోయాడనేది..

సాయిరెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్నది గ్రామంలో చిన్న పిల్లాడి నుంచి పండు ముదుసలి వరకు తెలుసు. జరిగిన తతంగమంతా అందరికీ ఎరుకే. అయినా ఎవరి నోట్లో నుంచి మాటా పెగలదు. 25 ఏండ్ల కిందట వచ్చిన అసెంబ్లీరౌడీ అనే సినిమా కొండారెడ్డిపల్లి దుస్థితికి అతికినట్లు సరిపోతుంది. అందరికీ నిజం తెలుసు. నిజం మాట్లాడితే.. మరణం వెంటాడుతుంది. గురువారెడ్డి ఆత్మహత్య గురించి సాయిరెడ్డి మాట్లాడితే.. సాయిరెడ్డి కూడా ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చింది. అలాంటి పరిస్థితులను నేటి ప్రభుత్వం తీసుకొస్తున్నది. అందుకే ఎవరూ ప్రశ్నించరు. ప్రశ్నిస్తే గురువారెడ్డి, సాయిరెడ్డిలా విగతజీవులుగా మారాల్సిందే.

మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఇంటి గేటుకు అడ్డంగా నిర్మించిన పశువైద్యశాల ప్రహరీ

ఆత్మహత్య కారకులను శిక్షించాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబర్ 23 : వంగూర్ మండలం కొండారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి వేధించి ఆత్మహత్యకు పురిగొల్పిన నిందితులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కల్వకుర్తి ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖాన మార్చురీలో ఉన్న సాయిరెడ్డి పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చాలా సౌమ్యుడు, మానవతావాది అయిన సాయిరెడ్డి 13ఏండ్లపాటు సర్పంచ్‌గా సేవందించారని, అలాంటి వ్యక్తిని వేధించి ప్రాణాలు తీసుకునేలా ఇబ్బందులు పెట్టడం చాలా దారుణమన్నారు. ఎంతో ఆత్మక్షోభకు గురైన సాయిరెడ్డి, అవమానాలను తట్టుకోలేక మరణ వాంగ్మూలం లేఖ రాసి ప్రాణాలు తీసుకోవడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిరెడ్డి తన మరణ వాంగ్మూలం లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుల వేధింపుల్లేతాను చనిపోతున్నానని పేర్కొన్నారని, ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం ఈ విషయమై నిష్పక్షపాత దర్యాప్తు జరిపించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, మధు, కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

- పేట అదనపు కలెక్టర్ బెన్‌షాలోం
- మాగనూర్, కృష్ణ మండలాల్లో కేజీబీవీ, ఎస్సీ హాస్టల్ తనిఖీ
- మాగనూర్ ఎంఐఎస్‌కు షోకాజ్ నోటీస్

ఊట్కూర్, (కృష్ణ) నవంబర్ 23 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం తోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ బెన్ షాలోం అన్నారు. శనివారం మాగనూర్, కృష్ణ మండలాల్లో కేజీబీవీ, ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. విద్యాలయాల్లో కిచెన్ గదులు, కూరగాయలు, వంట సరుకుల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు తాజా కూరగాయలు, ఆకుకూరలతో భోజనం వడ్డించాలన్నారు. బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. మాగనూర్ కేజీబీవీలో వాష్ రూం నుంచి దుర్వాసన వస్తోందని, శుభ్రం చేయించడం లేదని విద్యార్థులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మినరల్ వాటర్ సరఫరా చేయించాలని కోరారు. ఎస్‌వో రాధిక సమయ పాలన పాటించకపోవడంతో తమ సమస్యలను ఎవరితో చెప్పుకోలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అదనపు కలెక్టర్ విచారణ చేపట్టాలని తాసీల్దార్ సురేశ్‌ను ఆదేశించారు. ఎంఐఎస్ స్వప్న నిర్లక్ష్యంతో నెలల తరబడి కోడిగుడ్లు, సరుకుల బిల్లులు అందలేదని వంట ఏజెన్సీలు ఫిర్యాదు చేయడంతో ఎంఐఎస్ షోకాజ్ నోటీస్ అందజేయాలని ఎంపీడీవో రహీముద్దీన్‌ను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు శుచికరమైన భోజనం అందించేందుకు అధికారులు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే కృష్ణ తాసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అధికారులు సమయపాలన పాటించాలని ఆదేశించారు.

ఊట్కూర్ కేజీబీవీ తనిఖీ

మండలకేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను పేట ఆర్డీవో రాంచందర్ తనిఖీ చేశారు. హాస్టల్ వంటగదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థులకు తాగునీటి సరఫరాను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పులిమామిడి కేజీబీవీని సందర్శించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు, బాత్‌రూంలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి ఉమాపతి, ఎంపీడీవో ధనుంజయగౌడ్, పెద్దజట్రం, అవుసలోనిపల్లి, బిజ్వారం, మొగ్దుం పుల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మొగ్దుంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వంట ఏజన్సీలను రద్దు చేస్తామని హెచ్చరించారు.

అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

భర్తను హత్య చేసిన భార్య

- కూతురు, అల్లుడితో కలిసి గొడ్డలితో దాడిచేసి పరారు

నాగర్‌కర్నూల్, నవంబర్ 23: భూమి అమ్మకం విషయంలో చిన్నపాటి ఘర్షణకు భర్తను గొడ్డలితో మెడపై నరికి హత్య చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం వట్టిపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. సీఐ కనకయ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య(55), ఎల్లమ్మ భార్యభర్తలు. వీరికి ముగ్గురు కూతుర్లు, పెద్ద కూతురుకు వివాహమైంది. ఇంకా ఇద్దరు కూతుళ్లున్నారు. గ్రామ శివారులోని 300 సర్వే నెంబర్‌లో 14గుంటల భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భూమిని అమ్మేసి ఇల్లు నిర్మించుకోవడంతోపాటు మిగతా ఇద్దరు కూతుళ్ల పెండ్లిళ్లు చేయాలన్నది ఈశ్వరయ్య ఉద్దేశం. భూమి అమ్మవద్దని భార్య, బావమరిది బాలస్వామి, పెద్ద కూతురు స్వాతి, పెద్ద అల్లుడు మల్లేశ్ పట్టుబట్టారు. ఈ విషయంలో కొన్ని రోజులుగా ఇంట్లో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. వీరి మాటలు పట్టించుకోని ఈశ్వరయ్య భూమి అమ్మకానికి పెట్టడంతో ఇష్టంలేని కుటుంబ సభ్యులంతా కలిసి అర్ధరాత్రి గొడ్డలితో మెడపై నరికి పరారయ్యారు. పొద్దుపోయినా ఇల్లు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా ఈశ్వరయ్య రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పక్కనే గొడ్డలి ఉండడంతో హత్య చేసి చంపినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి కుటుంబ సభ్యులే హత్య చేశారని నిర్ధారించారు. మృతుడి చెల్లెలు విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

- నగదు తోపాటు వస్తువులు స్వాధీనం
- ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, నవంబర్ 23: వివిధ చోరీ కేసుల్లో పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన అలంపూర్ మండలం ఇమామ్‌పూర్‌కు చెందిన కుర్వ సిద్ధన్న(రిటైర్డ్ అటెండర్)తన కుమారుడు జితేందర్‌తో కలిసి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడానికి గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కారులో వచ్చారు. అనంతరం పని ముగించుకొని కలెక్టరేట్ ఎదుట హోటల్‌లో భోజనం చేసేందుకు కారును లాక్‌చేసి వెళ్లారు. లాక్‌చేసిన కారు అద్దాలు పగలకొట్టి కారులో ఉన్న రూ.3.60 లక్షలను కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, ఎస్సైలు శ్రీకాంత్, కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నలుగురు నేరం చేసినట్లు గుర్తించారు. నిందితుల కోసం నిఘా ఉంచగా అందులో ఒక్కరు(ప్రసంగి) (కప్పట్రాల తిప్ప బిట్రగుంటా గ్రామం, బోగోలు మండలం, నెల్లూరు జిల్లా) శనివారం ఉదయం ఎర్రవల్లి చౌరస్తా వద్ద మళ్లీ దొంగతనం చేసేందుకు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించి అరెస్ట్ చేశారు. కారులో అపహరించిన కేసు ప్రధానంగా ఉన్నట్లు గుర్తించి అతని నుంచి రూ.3.10లక్షలు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. ప్రసంగి గతంలో ఏపీలోని తిరుపతిలో చోరీ కేసులో జైలుకు వెళ్లినట్లు వెల్లడించారు. అనంతరం మిగతా ముగ్గురు నిందితుల కోసం నెల్లూరు జిల్లాలో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్, గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్, ఐటీకోర్ ఎస్సై రజిత, సిబ్బందిని అభినందించి క్యాష్ రివార్డ్ అందించారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

జిల్లాలో కొంతకాలంగా నిరుద్యోగులకు రైల్వేశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన అంకితను గద్వాల పోలీస్‌లు వ్యూహాత్మకంగా పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన చాకలి చిన్న నర్సింహులు ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అయనకు సరిత అనే ప్రైవేట్ ఉపాధ్యాయురాల ద్వారా అంకిత పరిచయమైంది. అంకిత రైల్వేశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని, నేను రైల్వేశాఖలోనే పని చేస్తున్నాని, రైల్వేశాఖలో పెద్ద అధికారులు నాకు చాలా బాగా తెలుసని నమ్మబలికించి చిన్నన్నర్సింహులకు వద్ద అంకిత ఆమె భర్త జగదీశ్వర్‌రెడ్డి రూ.6లక్షలు తీసుకున్నారు. నీకు ఉద్యోగం రాకపోతే 45 రోజుల్లో నీ డబ్బులు తిరిగి చెల్లిస్తామని చెప్పి మోసం చేశారు. చిన్న నర్సింహులు ఫిర్యాదు మేరకు ఈనెల 12వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంకిత నివాసం వద్ద పట్టుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

నిందితుడికి రిమాండ్

నిరుద్యోగులకు ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారి నుంచి డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గద్వాల మండలంలోని వెంకంపేటకు చెందిన యువరాజ్ ఆరోగ్య శాఖలో ఓ వైద్యుడి కార్ డ్రైవర్‌గా పనిచేస